
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

శనివారం 6 జూలై 2024





- నేడు ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ
- సీమ సాగు నీటి ప్రయోజనాలపై చర్చించాలి
- గుండ్రేవుల ప్రాజెక్టుపై చర్చలు సఫలం కావాలి
- శ్రీశైలం నీటి నిల్వలపై స్పష్టత సాధించాలి
- రాయలసీమ రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

ఏం మాట్లాడుతారో..?

కర్నూలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమస్యలే ప్రధాన అజెండాగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలు శనివారం (నేడు) హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సమావేశం కానున్నారు. ఏపీ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న సంస్థల విభజనమైనే ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. వీటితో పాటుగా రెండు రాష్ట్రాల మధ్య దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు సీఎంల భేటీలో చర్చించే అవకాశం ఉంది. చంద్రబాబు సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం కొలుదీరాక తెలుగు రాష్ట్రాల మధ్య సోదరసారుప్యత సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగానే విభజన సమస్యలపై మాట్లాడుకుందాం..! అంటూ చంద్రబాబు లేఖ రాయడం.. అంతేసానుకూలంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందిండంతో నేటి భేటీకి మార్గం సుగమనమైంది. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కాబోతుండడంతో సరిహద్దు రాయలసీమ రైతుల్లో హర్షం వ్యక్తమవుతుంది. విభజన సమస్యలతో పాటుగా శ్రీశైలం నీటి నిల్వలు, వినియోగం, ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రాణాధారమైన గుండ్రేవుల జలాశయం నిర్మాణం, దశాబ్దాలుగా పెండింగులో ఉన్న ఆర్డీఎస్ ఆనకట్ట ఆధునికీకరణ.. వంటి సమస్యలపై కూడా చర్చించాలి.. ఇరు రాష్ట్రాల రైతాంగం నీటి ప్రయోజనాలు కాంక్షిస్తూ సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు.

ఇరు రాష్ట్రాల సంజీవని 'సిద్ధేశ్వరం అలుగు'

శ్రీశైలం జలాశయం ఎగువన 854 అడుల లెవల్‌లో సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలని రాయలసీమ కరువు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అలుగు నిర్మాణం రెండు తెలుగు రాష్ట్రాలకు సంజీవని లాంటింది. జలాశయంలో చేరే పూడికను నివారించడం, రాయలసీమ, తెలంగాణ ప్రాజెక్టులకు సాగునీటి నిర్వహణ, ఇరు రాష్ట్రాలకు భవిష్యత్తుకు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ఎంతో అవసరం. ఈ ప్రాజెక్టుపై దశాబ్దాలుగా రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఇరు రాష్ట్రాలకు జల సంజీవని లాంటి ఈ అలుగు నిర్మాణంపై కూడా సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు చర్చించాలి. సఫలీకృతమయ్యేలా నిర్ణయాలు తీసుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, రైతులు ఆకాంక్షిస్తున్నారు.

శ్రీశైలం కనీసం నీటి మట్టంపై చర్చించాలి

రాయలసీమ జిల్లాల జీవనాధారం శ్రీశైలం ప్రాజెక్టు. గరిష్ట నీటి మట్టం 885 అడుగులు.. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 215.810 టీఎంసీలు. తెలుగు రాష్ట్రాలకు ప్రాణాధారం. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు సహా నెల్లూరు జిల్లాలకు వరద జలాలు మళ్లించి తాగు, సాగునీరు అందించే లక్ష్యంగా తెలుగుగంగ ప్రాజెక్టు, గాలేరు-నగరి ప్రాజెక్టు, హంద్రీనీవా ప్రాజెక్టులు చేపట్టారు. కనీస నీటి మట్టం 854 అడుగులకు తగ్గకుండా క్యారీ ఓవర్ కింద 60 టీఎంసీలు నిల్వ ఉంచాలని జస్టిస్ బచావత్ అవార్డు (కేడబ్ల్యూడీటీ-1) స్పష్టంగా చెబుతుందని రాయలసీమ సాగునీటి నిపుణులు చెబుతున్నారు. ఇందుకు విరుద్ధంగా ఏటేటా డెడ్ స్టోరేజీ కంటే దిగువకు నీటిని వదిలేసి జలాశయం ఖాళీ చేయడం సీమ రైతులు ఆందోళన వ్యక్తం అవుతుంది. శ్రీశైలం కనీస నీటి మట్టం 854 అడుగులుగా కొనసాగించాలని 'రూల్ కర్వ్ ముసాయిదా'లో ఉందని కేఆర్ఎంబీ చెబుతోంది. జస్టిస్ బచావత్ (కేడబ్ల్యూడీటీ-1) అవార్డు, టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) పత్రాలు, తమిళనాడు రాజధాని చెన్నైకి తాగునీటి సరఫరా కోసం జరిగిన ఒప్పందాలను పరిగణలోకి తీసుకొని రూల్ కర్వ్ రూపొందించామని కేఆర్ఎంబీ చెబుతుంది. అంశంపై రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) సమావేశాల్లో చర్చించకుండా తెలంగాణ అభ్యంతరం చెబుతోంది. ఆర్ఎంసీ సమావేశాలకే రావడం లేదు. ఏపీ పునర్విభజన చట్టం సెక్షన్ -89ఏలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీలు కృష్ణా జలాలు ప్రాజెక్టుల వారీగా ఏపీ ప్రాజెక్టులకు 512 టీఎంసీలు, తెలంగాణ ప్రాజెక్టులకు 299 టీఎంసీలు కేటాయించాలని స్పష్టంగా పొందుపరిచారు. 2015లో ఢిల్లీలో జరిగిన అప్పటి రెండు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, కేసీఆర్‌లు దీనికి ఆమోదం తెలుపుతూ సంతకాలు కూడా చేశారు. ఆ తరువాత సగభాగం వాటా రావాలంటూ తెలంగాణ రాష్ట్ర పేచి పెట్టింది. వీటిపై కూడా తాజా చర్చల్లో ఇరు రాష్ట్రాల సాగునీటి ప్రాజెక్టు పరిధిలో రైతులకు నీటి ప్రయోజనాలకు భద్రత కల్పించాల నిర్ణయం తీసుకోవాలని సీమ ప్రజలు కోరుతున్నారు.

కరువు రైతు ప్రాణాధారం 'గుండ్రేవుల'

కర్నూలు మండలం సుంకేసుల డ్యాం ఎగువన సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామం సమీపంలో తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మించాలనే ప్రతిపాదన. ఈ రిజర్వాయర్ నిర్మాణం చేస్తే కర్నూలు-కడప (కేసీ) కాలువ పరిధిలోని 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు సాగునీరు, 6.50 లక్షలు జనాభా కలిగిన కర్నూలు నగర ప్రజలు, డ్యాం ఎగువన కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని నియోజకవర్గాల్లో కరువు పల్లెసీమలకు సాగు, 8.50 లక్షలకు పైగా జానాభాకు తాగునీరు ఇవ్వవచ్చు. తెలంగాణలో రాష్ట్రంలో ఆర్డీఎస్ యడమ కాలువ కింద ఆయకట్టుకు 5 టీఎంసీలు సాగునీరు ఇవ్వవచ్చు. సీమ రైతుకు గుండెలాంటి ఈ ప్రాజెక్టుకు రిటైర్డ్ ఇంజనీరు సుబ్బరాయుడు రూకకల్పన చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వే, డీపీఆర్ తయారీ కోసం రూ.54.95 లక్షల మంజూరు చేస్తూ 2013 నవంబరు 1న జీవో ఎంఎస్ నంబరు.100 జారీ చేశారు. సర్వే చేసిన ఆర్వే అసోషియేట్ సంస్థ సమగ్ర ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేసింది. రూ.2,890 కోట్లు నిధులు కావాలని రాష్ట్ర విభజన తరువాత ఏపీ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. 2019 ఫిబ్రవరి 21న అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం రూ.2,890 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీఓ నం.154 జారీ చేసింది. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం గుండ్రేవుల ప్రాజెక్టును గాలికొదిలేసింది. ప్రస్తుతం నిర్మాణం వ్యయం రూ.5,500 కోట్లు నుంచి రూ.6 వేల కోట్లకు చేరింది.

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణంలో కర్నూలు జిల్లాలో 8 గ్రామాలు పూర్తిగా, నాలుగు గ్రామాలు పాక్షికంగా, 6,166.15 ఎకరాలు (ఇందులో 4,445.74 ఎకరాలు ప్రైవేటు భూమి) ముంపునకు గురవుతుంది. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలో మూడు గ్రామాలు పూర్తిగా, రెండు గ్రామాలు పాక్షికంగా, 3,003.24 ఎకరాలు ముంపునకు గురవుతాయి. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ద్వారా సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు తెలంగాణ ప్రభుత్వానికి గతంలోనే పంపారు.

ఆర్డీఎస్ పరిష్కారమయ్యేనా?

తుంగభద్ర నదిపై కర్నూలు జిల్లా కోసిగి మండలం అగసనూరు, కర్ణాటకలోని రాజోలిబండ గ్రామాల మధ్య 1949-55 మధ్య రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) ఆనకట్ట నిర్మించారు. ఎడమ వైపున ఆర్డీఎస్ కాలువ నిర్మించారు. ఈ కాలువ 0-45 కి.మీలు వరకు కర్ణాటక పరిధిలో, 45 కి.మీలు నుంచి తెలంగాణ రాష్ట్రంలో ప్రవహిస్తుంది. ఆనకట్ట నిర్మాణంలో భాగంగా కట్ట దిగువన 19 హ్యూమ్ పైప్స్ ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల క్రితం వరకు తుంగభద్రకు నిత్యం వరదలు ఉంటుండడం వల్ల వీటి వల్ల సమస్య తలెత్తలేదు. ఆర్డీఎస్ ఎగువన పూడిక చేరడంతో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల (మహబూబ్ నగర్) జిల్లా రైతులకు సాగునీరు అందడం లేదని, ఆనకట్ట దిగువున ఉన్న హ్యూమ్ పైపులు మూసివేయాలని 2003లో తెలంగాణ రైతులు ఆనకట్టను ముట్టడించడం. కర్నూలు రైతులు అడ్డుకోవడంతో జల యుద్ధమే జరిగింది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయ్యాక ఆ పైపులు మూసి వేయించారు. 2005 జూలై 5న ఆర్డీఎస్ మోడ్రనైజేషన్ కోసం రూ.58.94 కోట్లు నిధులు మంజూరు చేస్తూ జీవో ఎంఎస్ నంబరు.155 జారీ చేశారు. ఆధునికీకరణలో భాగంగా ఆనకట్టపై 20 ఎంఎం ఆంకర్ రాడ్స్ డ్రిల్లింగ్ చేసి ఏర్పాటు చేయడం, దానిపై ఆర్‌సీసీ కవరింగ్ చేయడం వల్ల ఆనకట్ట ఎత్తు 1090 నుంచి 1090.50 అడుగులు అంటే.. 0.50 అడుగులు (15 సెం.మీ) పెరుగుతుంది. ఈ పనులను 2016 మే16న కర్ణాటక ఇంజనీర్లు చేపడితే రైతులు అడ్డుకున్నారు. రెండు దశాబ్దాలుగా వివాదం నడుస్తుంది. గుండ్రేవుల జలాశయం నిర్మాణం చేపడితే ఆర్డీఎస్ వివాదం ఉండదని రాయలసీమ సాగునీటి నిపుణులు అంటున్నారు.



ఆర్డీఎస్ ఆనకట్ట

ఎంపీ తండ్రిగా పెత్తనమంటే కుదరదు

- వైసీపీ నాయకులను టీడీపీలోకి తెస్తానంటే ఒప్పుకోం
- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు రూరల్, జూలై 5 : నందికొట్కూరు నియోజకవర్గంలో ఎంపీ తండ్రినని పెత్తనం చెలాయిస్తే కుదరదని, వైసీపీ నాయకులను టీడీపీలోకి తెస్తానంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం అల్లూరు గ్రామంలోని మాంద్ర నివాసంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, మండల కన్వీనర్లతో కలిసి ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ నంద్యాల ఎంపీ శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరెడ్డి టీడీపీ కండువా కూడా కప్పుకోలేదని అన్నారు. గడిచిన ఎన్నికల్లో తన ఓటమికి పావులు కదిపిన వ్యక్తుల్లో ఆయన ఒకరని మండిపడ్డాడు. టీడీపీ నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ అవినీతిపరులను తెలుగుదేశం పార్టీలో చేర్చుకునే ప్రసక్తే ఉండకూడదని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబునాయుడు స్పష్టంగా తెలియజేశాడని గుర్తు చేశారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరెడ్డి మాత్రం అలాంటివి ఏమీ పట్టించుకోకుండా నందికొట్కూరు వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లను, వైసీపీ సర్పంచులను కొన్ని రోజుల నుంచి అక్కున చేర్చుకుని టీడీపీ కండువా కప్పుతున్నాడని తెలిపారు. వారంతా బైరెడ్డి సిద్దార్థరెడ్డి ముఖ్య అనుచరులని, వైసీపీలో ఉంటూ ఎన్నో అక్రమాలకు అవినీతికి పాల్పడ్డారని, వారి అవినీతి బయట పడుతుందని బైరెడ్డి రాజశేఖరెడ్డి వద్దకే వెళ్లి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ గ్రామ స్థాయి నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన వారేనని గుర్తు చేశారు. అలాంటి వారికి ఆశ్రయం ఇస్తే నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు క్షమిస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిని తెలుగుదేశం పార్టీలోకి చేర్చుకుని నందికొట్కూరులో పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరం ప్రసాదరెడ్డి, కాతా రమేష్‌రెడ్డి, కడియం వెంకటేశ్వర్లు, నారపురెడ్డి, కౌన్సిలర్ జాకీర్, లాయరన్ జాకీర్, టీడపీ కౌన్సిలర్ భాస్కరెడ్డి, ఓబుల్ రెడ్డి, శ్రీనివాసులు, పలుచాని మహేశ్వరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

టీడీపీలో చేరిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు



బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు

నందికొట్కూరు, జూలై 5: మున్సిపల్ చైర్మన్, వైసీపీ కౌన్సిలర్లు శుక్రవారం టీడీపీలో చేరారు. నందికొట్కూరు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో వైసీపీకి చెందిన నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డితోపాటు కౌన్సిలర్లు చిన్న రాజు, సురేష్, రావూఫ్, లాలుప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు గఫార్ టీడీపీలో చేరారు. వైసీపీ వార్డు ఇన్‌చార్జి రామకృష్ణ, ఉస్మాన్‌బేగ్, సత్యనారాయణ, కురువ శ్రీనివాసులు, ప్రాతకోట రమేష్, రమేష్, రజినికుమార్‌రెడ్డి, వీరబొమ్మ శ్రీనివాసులు, రాజశేఖరప్ప, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపీ నిధులను కేటాయించి పట్టణాభివృద్ధికి సహకరిస్తామన్నారు. గత మూడేళ్లగా నందికొట్కూరు పట్టణం అభివృద్ధికి నోచుకోలేదని, ఈ రెండేళ్లలో పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని చైర్మన్, కౌన్సిలర్లకు బైరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కొందరు కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు, పట్టణంలోని వార్డు ఇన్‌చార్జిలు టీడీపీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. మరో ముగ్గురు కౌన్సిలర్లు అనారోగ్యం కారణంగా ఇక్కడికి రాలేదని, త్వరలో వారు కూడా పార్టీలో చేరతారన్నారు. ఎంపీ బైరెడ్డి శబరికి సహకరిస్తూ, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సలహాలతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగి చేతివాటం

- రూ.2.16 లక్షల పింఛను సొమ్ము స్వాహా
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని జిల్లా అధికారులు



కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయం

కోవెలకుంట్ల, జూలై 5: సచివాలయ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. రూ.2.16 లక్షల పింఛన్ సొమ్మును స్వాహా చేశాడు. వివరాలిలా.. కోవెలకుంట్ల పట్టణంలోని ఓ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంటుగా 2020 నుంచి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి ప్రతి నెలా పింఛన్లు పంపిణీ చేస్తున్నాడు. తరువాత చనిపోయిన వారివి, మిగిలిన డబ్బులు తిరిగి ప్రభుత్వానికి చెల్లించకుండా తన సొంత అవసరాలకు వాడుకుంటూ వచ్చాడు. ఇలా ప్రతి నెలా కొంత కాలం సొమ్ము వాడుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక అధికారులు ఆ సచివాలయ ఉద్యోగిని మందలించి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకుపోయారు. మండల స్థాయి అధికారి స్వాహా చేసిన సొమ్ము రికవరీ చేసి ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా అధికారులకు లెటరు పెట్టారు. అయితే అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ ఆ జిల్లా అధికారి ఆ సచివాలయ ఉద్యోగిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ ఉద్యోగి తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి పింఛను డబ్బు లు స్వాహాపై విచారణ జరిపించి ఆ సచివాలయ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పింఛను డబ్బులు స్వాహా అయిన విషయంపై ఈవో గోపినాథ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఆ సచివాలయ ఉద్యోగి పింఛను డబ్బులు స్వాహా చేసిన విషయం వాస్తవమేన ని, ఆ డబ్బులు రికవరీ కోసం గ్రామ పంచాయతీకి తీర్మానం చేసి ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులకు తెలిపామని వివరించారు.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపట్టాలి

మంత్రి ఫరూక్‌ను కోరిన సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు

నంద్యాల టౌన్/ నంద్యాల నూనెపల్లి జూలై 5: రాయలసీమలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించి సాగునీటి రంగ సమస్యల పరిష్కారానికి టీడీపీ ప్రభుత్వం కృషి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బొజ్జా దశరథరామిరెడ్డి ఇంటికి రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన విజయం కోసం సహకరించినందుకు బొజ్జా దశరథరామిరెడ్డికి మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సాగునీటి సాధన సమితి కార్యవర్గ ప్రతినిధులతో వివిధ సమస్యలపై మంత్రి ఫరూక్ చర్చించారు. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ళ కాలంలో వైసీపీ ప్రభుత్వం విధ్వంసపాలన చేసిందన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధికి దశాబ్దాల తరబడి పాలకుల నిర్లక్ష్యంతో సాగునీటి రంగంకు తీవ్ర నష్టం చేకూరిందని, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి సీమ ప్రాంత సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరింపజేయాలని మంత్రి ఫరూక్‌ను బొజ్జా కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి ఫరూక్ రాయలసీమ వాసిగా ఇక్కడి ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థలాన్ని నిర్వీర్యం కాకుండా కాపాడుతామన్నారు. అదేవిధంగా వైద్యకళాశాల ఏర్పాటును తాము అడ్డుకోలేదని, అయితే అనువైన స్థలంలో నిర్మించాలని డిమాడ్ చేశామన్నారు. ఆర్ఏఆర్ఎస్ స్థలాన్ని అలాగే ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సాగునీటి సాధన సమితి ప్రతినిధులు ఏర్వ రామచంద్రారెడ్డి, పునులూరు గోపాల్‌రెడ్డి, వైఎన్‌రెడ్డి, నెట్టూరి సుధాకర్‌రావు, పర్వేస్, తదితరులు పాల్గొన్నారు.



సాగునీటి సమస్యలను వివరిస్తున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

మహానందిని వదలని చిరుత



మహానంది గోశాల వద్ద చిరుతపులి సంచారం

మహానంది, జూలై 5: మహానంది ఆలయ పరిసరాలను చిరుతపులి వదలడం లేదు. గత కొద్ది రోజులుగా సంచరిస్తున్న చిరుతపులి తాజాగా శుక్రవారం తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో దేవస్థానం గోశాల వద్ద కనిపించడంతో మరోసారి కలకలం రేపింది. గోశాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో చిరుతపులి సంచారం స్పష్టంగా కనిపించింది. ఉదయం విధులకు వచ్చిన ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు సీసీ పుటేజీలను పరిశీలించారు. చిరుతపులి సంచారం మరోసారి కనిపించడంతో విషయాన్ని వెంటనే అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా చిరుతపులి కదలికలపై స్థానికులు, భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతపులిని బంధించి సుదూర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

శ్రీశైలంలో బయటపడిన శివలింగం, శిలాశాసనం



బయటపడిన శివలింగం, శిలాశాసనం

శ్రీశైలం, జులై 5: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలం మహాక్షేత్రంలో రాతిపై చెక్కబడిన నందీశ్వరునితో కలిసిన ఉన్న శివలింగం, శాసనం శుక్రవారం బయటపడింది. రుద్రాక్ష మఠం-సారంగధార మఠం మధ్యలో రోడ్డు విస్తరణ పనులు చేస్తుండగా రాతిపై చెక్కబడిన శివలింగం కనిపించింది. శివలింగం పానమట్టానికి దిగువ భాగంలో తెలుగు లిపిలో రాసివుంది. అక్కడికి చేరుకున్న దేవస్థానం సహాయ స్థపతి యు.విజవహర్‌లాల్ శివలింగం పక్కనే చెక్కబడిన శాసనాన్ని ఫొటోలు తీసి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఎపిగ్రఫి)డైరెక్టరుకు పంపారు. పరిశీలించిన అధికారులు ఈ శాసనం, శివలింగం 14-15 శతాబ్ధం నాటిదిగా గుర్తించారు. గతంలో క్షేత్రపరిధిలోని పంచమఠాల పునరుద్ధరణ పనులు చేపట్టినప్పుడు వెండి, తామ్ర శాసనాలు బయడపడ్డ విషయం తెలిసిందే.



భయపెడుతున్న జునోసిస్

- జంతువుల నుంచి మనుషులకు సంక్రమణ
- అప్రమత్తంగా లేకుంటే ప్రాణాంతకమే..!
- నేడు ప్రపంచ జునోసిస్ డే..
- జిల్లాలో 23870 డోసుల యాంటీ రేబిస్ టీకాలు



నంద్యాల టౌన్, జూలై 5 :

జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జునోసిస్ వ్యాధులు భయపెడుతున్నాయి. జంతువుల ద్వారా వివిధ రకాల వైరస్‌ల వల్ల వ్యాప్తి చెందే జునోసిస్ వ్యాధులను అరికట్టే ప్రయత్నంలో ప్రభుత్వం వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో జంతువుల పెంపకం ఇళ్లలో సర్వసాధారణంగా మారింది. పెంపుడు జంతువుల ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ఆ జంతువులకు ఉండే వ్యాధుల వైరస్‌లు మనిషికి సంక్రమించి ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కుక్క కాటు బారిన పడిన ఒక బాలుడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు (1885 జూలై 6) కావడం వల్ల జూలై 6వ తేదీన ప్రపంచ జునోసిస్ దినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

అవగాహన, అప్రమత్తత ముఖ్యం

మూగ జీవాల పెంపకంలో అవగాహనతోపాటు అప్రమత్తత ఎంతో అవసరం. ఇళ్లలో పెంచుకునే కుక్కల వల్ల రేబిస్ వ్యాధి సంక్రమిస్తుంది. ఇదే కాకుండా గజ్జి, గడ్డి తినే జంతువుల నుంచి ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు మనుషులకు సోకుతాయి. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులే జునోసిస్ డీసీజెస్ వ్యాధులుగా, 180 రకాలకు పైగా పశుపక్షాదులు, జంతువుల నుంచి మనుషులకు సంక్రమిస్తున్నట్లు పశుసంవర్థక శాఖ వెల్లడిస్తోంది. జంతువులు, పశుపక్షాదులతో నిత్యం దగ్గరగా ఉండే రైతులు, వధ శాలల కార్మికులు, పశువైద్యులతోపాటు పెంపుడు జంతువులతో సన్నిహితంగా ఉండే వారు జునోసిస్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరికి ప్రధానంగా రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసుల్లోసిస్, క్షయ, తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇందులో ప్రధానంగా రేబీస్ వ్యాధి అత్యంత ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి అని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి.గోవిందనాయక్ పేర్కొన్నారు. జునోసిస్ వ్యాధుల పట్ల పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు అవగాహన పెంచుకొని తగిన నివారణ చర్యలు తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సి ఉంది.

యాంటీ రేబిస్ టీకాల డోస్‌ల పంపిణీకి ఏర్పాట్లు



ప్రపంచ జునోసిస్ దినంగా సందర్భంగా నంద్యాల జిల్లాలో ఈ నెల 6వ తేదీన పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ బి. గోవిందనాయుడు తెలిపారు. జిల్లాలోని అన్ని పశు వైద్యశాలలు, ప్రాంతీయ పశువైద్య శాలల్లో ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 23870 డోసులు యాంటీ రేబీస్ టీకాలు సిద్ధంగా ఉంచామని, వివరాలకు టోల్ ఫ్రీ నంబరు 1962 లేదా దగ్గరలోని పశు వైద్యశాలలో గానీ, సమీప రైతు సేవా కేంద్రంలో గానీ పశువుల పెంపకందారులు, రైతులు, ప్రజలు సంప్రదించాలని కోరారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

- రూ.32 లక్షల విత్తనాలు సీజ్



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 5: ఆదోని పట్టణంలోని ఎరువులు విత్తన దుకాణాలు, ట్రాన్స్‌పోర్ట్‌లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు చేపట్టారు. దాడుల్లో పలు దుకాణాల్లోని రసాయనిక ఎరువులు, పత్తి విత్తనాలు ఉన్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏడీఏ హనుమంతరావు తెలిపారు. శ్రీభీమేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణంలో స్టాక్‌బుక్, ఈ-పాస్ మిషన్‌లో పొందుపరిచిన రసాయనిక ఎరువుల నిలువలకు వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.5,88,520లు, 31,941 రసాయనిక ఎరువులను, రూ.2,46,240 విలువ గల బీటీ పత్తి విత్తనాలను, గీత హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో రూ.1,07,700ల కూరగాయ విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. నవత ట్రాన్స్‌పోర్ట్, ఎస్ఆర్ఎంటీ ట్రాన్స్‌పోర్ట్‌లో తనిఖీ చేసి అనుమానాస్పదంగా ఉన్న విత్తనాల, ఎరువుల సరఫరా రికార్డులను పరిశీలించారు. ఈ దాడుల్లో ఏడీఏ అరుణకుమారి, ఏవో అశోక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

'లా' ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), జూలై 5: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన లా పరీక్షల్లో 3, 5 సంవత్సరాలకు సంబంధించి 2,4,6,8,10 సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం విడుదల చేసింది. రెగ్యులర్ విభాగంలో 4, 6, 8 సెమిస్టర్లలో 3వ సంవత్సరం 4 సెమిస్టర్లో 199కి 172, 6వ సెమిస్టర్లో 238కి 229 మంది, 5వ సంవత్సరం 4వ సెమిస్టర్లో 39కి 16, 6వ సెమిస్టర్లో 30కి 24, 8వ సెమిస్టర్లో 44కు 35మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ విభాగంలో 2, 4, 6, 8, 10 సెమిస్టర్లలో 3వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 23కు 13, 4వ సెమిస్టర్లో 45కు13, 6వ సెమిస్టర్లో 12కు 10 మంది, 5వ సంవత్సరం 2వ సెమిస్టర్లో 11కు మొదటి, 4వ సెమిస్టర్లో 15కు 3, 6వ సెమిస్టర్లో 5కు2, 8వ సెమిస్టర్లో4కు 1, 10వ సెమిస్టర్లో 4కు ఇద్దరు చొప్పున ఉత్తీర్ణత సాధించారు.

రైలు కింద పడి మహిళ మృతి

మంత్రాలయం, జూలై 5: మండలంలోని తుంగభద్ర (మంత్రాలయం రోడ్డు) రైల్వే స్టేషన్ సమీపంలో తుంగభద్ర నది బ్రిడ్జిపై దాదాపు 40 ఏళ్ల మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం తుంగభద్ర నుంచి రాయచూరు వెళ్తున్న గూడ్స్‌రైలుకు నది బ్రిడ్జిపై ఎదురుగా రావడంతో ఢీకొట్టింది. దీంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. మహిళ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతిగా రాయచూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయచూరు ఆసుపత్రికి తరలించారు.

త్వరలో విజయవాడ నుంచి కర్నూలుకు విమాన సర్వీసులు

కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్



కేంద్ర మంత్రిని కలిసిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జూలై 5: విజయవాడ నుంచి కర్నూలుకు త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ నుంచి కర్నూలు ఎయిర్ పోర్టుకు విమాన సౌకర్యం కల్పించాలని, ముఖ్యంగా రాత్రి సమయాన ఫ్లైట్ ల్యాండింగ్ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. విమాన సర్వీసులు ప్రారంభిస్తామని, ఏడాదిలోపు రాత్రిపూట ల్యాండ్ అయ్యేందుకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయిస్తామని చెప్పారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేయండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

మద్దికెర, జూలై 5: అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా మద్దికెర, చిప్పగిరి, హొళగుంద గ్రామాలను కేంద్ర ప్రభుత్వం సంపూర్ణత అభియాన్ కింద ఎంపిక చేసిందని అన్నారు. ఈ మండలాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని, ఇచ్చిన లక్ష్యాన్ని అధికమించాలని అధికారులను ఆదేశించారు. ఈ మండలాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఆశా వర్కర్లు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వ్యవసాయ శాఖ, ప్రభుత్వ వైద్యశాల, హార్టికల్చర్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నీతి అయోగ్ కోఆర్డినేటర్ స్మృతి సబర్వాల్, అడిషినల్ డీఎంహెచ్‌వో భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఆర్డీవో రామలక్ష్మి, ఎంపీడీవో అలివేలమ్మ, ఎంపీపీ అనితా యాదవ్, సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి, తహసీల్దార్ రజాక్‌వలి, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి రెడ్డి, మాజీ జడ్పీటీసీలు పి.పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, టీడీపీ నాయకులు గూడూరు ధనుంజయుడు, చంద్రశేఖర్ గౌడు, లక్ష్మినారాయణ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒడిస్సా యువకుడి మృతి

మంత్రాలయం, జూలై 5: విద్యుదాఘాతానికి గురై ఒడిస్సా యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి జరిగింది. మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన బోరు వేసే యంత్రం వ్యవసాయ బోర్లు వేసేందుకు సూగూరు గ్రామానికి వచ్చింది. దినసరి కూలీగా పని చేస్తున్న మంతిరి గోండా పొలాలకు వెళ్లే దారిలో కట్టెతో విద్యుత్ వైర్లను పైకెత్తే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది సొంతూరు ఒడిస్సా రాష్ట్రం రాయ్‌ఘర్ మండలం గంజపార గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీ డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కూలీలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రాలయం మఠానికి రూ.3.51 లక్షల విరాళం

మంత్రాలయం, జూలై 5: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి ముంబాయికు చెందిన రాఘవకృష్ణన్ దైనందిక సేవకు రూ.లక్ష, పాట్నాకు చెందిన అరుణ బసవరాజులనే భక్తురాలు రూ.2,51,100 విరాళంగా ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషిలు తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.3,51,100 నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతలకు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

8వ తేదీ నుంచి ఉచితంగా ఇసుక

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, జూలై 5: ఇళ్ల నిర్మించుకునే వారికి ఈ నెల 8 నుంచి ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రాలయం టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ నివాసంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక మాఫియాతో దోచుకుందని అన్నారు. ప్రస్తుతం ఇసుక రవాణా చేయకూడదన్న ఆదేశాలు ఉన్నప్పటికీ గ్రీన్‌కో కంపెనీ ద్వారా లారీలతో 250 కి.మీ. దూరంలో ఉన్న గోరుకల్లు ప్రాజెక్టుకు అధికారులు, కాంట్రాక్టర్లు యథేచ్ఛగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వానికి దోచి పెట్టిన మైనింగ్ అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని చెప్పారు. సమావేశంలో మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, మాధవరం కృష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్, నవకోటి నారాయణ, పైబావి నర్సిరెడ్డి, యేబు, నరసింహులు, సుంకప్ప, తిక్కస్వామి గౌడు, రామక్రిష్ణ, నాగరాజు, గురురాజు తదితరులు పాల్గొన్నారు.

- రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి శుక్రవారం ఉదయం మంత్రాలయం వచ్చారు. ఈయనకు ఆలయ మహా ముఖద్వారం వద్ద జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, బిందుమాధవ్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గిరిజన మహిళపై వైసీపీ నాయకుల దాష్టీకం

నంద్యాల (నూనెపల్లె), జూలై 5: గిరిజన మహిళపై వైసీపీకి చెందిన నాయకులు దాష్టీకానికి పాల్పడ్డారు. తమ స్థలంలో లీజుకు తీసుకుని మహిళ హోటల్ నిర్వహిస్తుండగా రెంట్‌కు సంబంధించిన లావాదేవీల వ్యవహారంలో మహిళపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడిన ఘటన నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ చాబోలు మెట్ట వద్ద చోటు చేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పాణ్యంకు చెందిన గిరిజన మహిళ మంజుబాయి నంద్యాల మండలం చాబోలు మెట్ట వద్ద అదే గ్రామానికి చెందిన నరసింహారెడ్డి పురుషోత్తంలకు చెందిన కొంత స్థలాన్ని హోటల్ నిర్వహణకు తీసుకున్నారు. కొన్ని నెలల నుంచి రెంట్ బకాయిలు ఉండటంతో చెల్లించాలని స్థల యజమానులు ఒత్తిడి తెచ్చారు. తాను హోటల్‌పై రూ.12 లక్షల వరకు ఖర్చు చేశానని వాటిని చెల్లించాలని నిర్వాహకులు అనడంతో ఇద్దరి మధ్య మూడు వారాల క్రితం ఘర్షణ జరిగింది. మంజుబాయిపై నరసింహారెడ్డి, మరి కొంత మంది దాడికి పాల్పడి అప్పట్లో తీవ్రంగా గాయపరిచారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు కేసు నమోదు చేయలేదు. అయితే రెంట్ బకాయిలు చెల్లించాలని ఒత్తిడి తీసుకు రావడంతో పలుమార్లు ఇరువురు ఘర్షణలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ఇరు వర్గాలకు తాలూకా అర్బన్ సీఐ దస్తగిరి 45 నోటీసులు జారి చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. ఇదే ఘటనపై విషయంపై శుక్రవారం మళ్ళీ ఘర్షణ చోటు చేసుకోవడం చాబోలుకు చెందిన పురుషోత్తం రెడ్డి, మరి కొంత మంది మంజుబాయిపై దాడికి పాల్పడి గాయపరిచారు. దీంతో బాధితురాలు ఎస్సీఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని పోలీసులను ఆశ్రయించింది. ఈ దాడిపై తాలూకా సీఐని వివరణ కోరగా దాడిపై బాధితురాలు ఫిర్యాదు చేసిందని విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

శిరివెళ్ల, జూలై 5: మండలంలోని వెంకటాపురం గ్రామ పంట పొలాల్లో విద్యుదాఘాతానికి గురై శిరివెళ్లకు చెందిన షేక్.జాకిర్‌హుసేన్ (35) అనే యువకుడు మృతి చెందాడు. విద్యుత్ స్తంభం ఎక్కి జంపర్లు సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. జాకిర్‌హుసేన్ శిరివెళ్లలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో బిల్ లీడర్‌గా కొన్నేళ్ల నుంచి పని చేస్తున్నాడు. విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తున్న సమయంలో విద్యుత్ ఎలా వచ్చిందో, ప్రమాదం ఎలా చోటు చేసుకుందో అధికారుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. సంఘటనా స్థలాన్ని శిరివెళ్ల ఎస్ఐ, విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఈ విషయంపై ఎస్ఐ సురేష్‌ను వివరణ కోరగా మృతుడి కుటుంబ సభ్యులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

సైట్ ఇంజనీర్ బదిలీ వివాదాస్పదం

- డోన్ నుంచి కర్నూలుకు మార్పు
- ఎస్ఈకి తెలియకుండానే చేయడంపై విమర్శలు

కర్నూలు(న్యూసిటీ), జూలై 5: గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్)లో ఓ సైట్ ఇంజనీర్ బదిలీ వివాదాస్పదంగా మారింది. డోన్ సబ్‌డివిజన్ కార్యాలయంలో పని చేస్తున్న సైట్ ఇంజనీర్ రవికుమార్‌ను కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌కు బదిలీ చేయడంపై చర్చ మొదలైంది. అవసరం లేకుండా ఎలా బదిలీ చేస్తారంటూ కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి వరకు డోన్‌లో పని చేస్తున్న సమయంలో సైట్ ఇంజనీర్‌పై వివిధ రకాల ఆరోపణలు వచ్చాయి. వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతూ బిల్లులు మంజూరు చేసేవారని అప్పట్లోనే కొందరు అధికారులు ఇంజనీర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసేవారు. ప్రస్తుతం డోన్ సబ్ డివిజన్ నంద్యాల జిల్లాకు వస్తుంది. అయితే నంద్యాల సూపరింటెండెంట్ ఇంజనీర్ మనోహర్‌కు తెలియకుండానే ఈ బదిలీ జరిగిందని కొందరు చర్చించుకుంటున్నారు.

ఇద్దరు అధికారుల మధ్య వాగ్వివాదం..

తనకు తెలియకుండా సైట్ ఇంజనీర్‌ను ఎలా బదిలీ చేస్తారంటూ నంద్యాల ఎస్ఈ కర్నూలులోని ఓ అధికారిని ప్రశ్నించినట్లు సమాచారం. అయితే ఎస్ఈ చొరవతో చేసుకున్నానని ఆ అధికారి సమాధానం ఇచ్చారని తెలిసింది. నంద్యాల జిల్లా నుంచి కర్నూలుకు బదిలీపై వెళ్లాలంటే తన అనుమతి తీసుకోవాలన్న విషయం కూడా తెలియదా అని ఎస్ఈ ఇంకో అధికారితో వాదించారని, అదంతా తనకు తెలియదని ఏదైనా ఉంటే కర్నూలు ఎస్ఈతో మాట్లాడుకోవాలని సదరు కర్నూలు అధికారి సమాధానం ఇచ్చినట్లు సమాచారం.

సైట్ ఇంజనీర్‌పై మొదటి నుంచి ఆరోపణలే..

సైట్ ఇంజనీర్‌పై మొదటి నుంచి ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ఈ ఐదేళ్లు వైసీపీ కండువా వేసుకుని విధులు నిర్వహించారని అప్పట్లోనే అధికారులు, సిబ్బంది విమర్శించారు. అంతేగాకుండా మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డికి అనుకూలంగా ఉన్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అక్కడ టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అనుచరులు ఆ ఇంజనీర్‌ను ఇబ్బందులకు గురిచేస్తారేమోనన్న భయంతో బదిలీ చేసినట్లు తెలిసింది. కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ డీఈగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌రెడ్డి డోన్ సబ్‌డివిజన్ డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి ఆదేశాలతోనే రవికుమార్‌ను కర్నూలుకు బదిలీ చేసినట్లు బలమైన నిజాలు వినిపిస్తున్నాయి.

నా దృష్టికి రాకుండానే బదిలీ చేశారు

సైట్ ఇంజనీర్ బదిలీ విషయం అస్సలు తెలియదు. నాకు తెలియకుండానే బదిలీ చేశారు. ముఖ్యంగా నా అనుమతితోనే ఇతర జిల్లాకు బదిలీ చేయాలి. అలాంటిదేమి ఇక్కడ పాటించలేదు. ఇష్టానుసారంగా బదిలీ చేసుకున్నారు.

-మనోహర్, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్, నంద్యాల జిల్లా

ఆరోగ్య కారణాలతో బదిలీ చేశాం

సైట్ ఇంజనీర్ రవికుమార్‌కు ఆరోగ్య సమస్యలు ఉన్న కారణంగానే కర్నూలు క్వాలిటీ కంట్రోల్‌కు బదిలీ చేశాం. సైట్ ఇంజనీర్లకు సంబంధించి రెండు జిల్లాలకు కర్నూలు ఎస్ఈనే బదిలీ చేయాల్సి ఉంది. నంద్యాల ఎస్ఈ రెకమెండ్ చేయలేదు. అయితే డోన్ సబ్‌డివిజన్ డీఈ రెకమెండ్ చేయడంతోనే బదిలీ చేశాను.

-నాగేశ్వరరావు, ఎస్ఈ ఆర్‌డబ్ల్యూఎస్, కర్నూలు జిల్లా

బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇద్దరి పరిస్థితి విషమం.. కర్నూలు ఆసుపత్రికి తరలింపు

కోసిగి, జూలై 5: బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం తుంబలపల్లి గ్రామానికి చెందిన సిద్ధు ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం బైక్‌పై బయలుదేరాడు. సాతనూరు గ్రామానికి చెందిన హరి, వీరేంద్రలు ఉరుకుందలో స్వామివారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. కోసిగికి 3 కి.మీ. సమీపంలో వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. సాతనూరు గ్రామానికి చెందిన వీరేంద్ర, హరి ఇద్దరికి కాళ్లు విరిగిపోయాయి. సిద్దును ప్రైవేటు వాహనంలో మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించగా.. వీరేంద్ర, హరిని 108 వాహనంలో ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. అక్కడ వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మొదలైన మట్టి భూసార పరీక్షలు

లక్ష్యం 37,500 భూసార పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 5: ఉమ్మడి కర్నూలు జిల్లాలో మట్టి భూసార పరీక్షలు పడకేశాయి. గత వైసీపీ ప్రభుత్వం రైతుల పొలాల్లో భూసార పరీక్షలు చేసేందుకు ఎటువంటి నిధులు ఇవ్వకపోవడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించకపోవడంతో మట్టి పరీక్షలు చేయలేని పరిస్థితి నెలకొంది. రైతుభరోసా కేంద్రాల్లో మట్టి భూసార పరీక్షలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఎటువంటి పనిముట్లు లేకపోవడం వల్ల వాటిల్లో పని చేస్తున్న సిబ్బంది మట్టి పరీక్షలు చేయలేకపోయారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటై భూసార పరీక్షలు చేయాలని ఆదేశించింది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రెండు జిల్లాలో 37,500 భూసార పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. కర్నూలు జిల్లాలో 19,500, నంద్యాల జిల్లాలో 18వేలు భూసార మట్టి పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆర్బీకేల్లో పని చేస్తున్న సిబ్బంది రైతుల పొలాలకు వెళ్లి మట్టి నమూనాలను తీసి ప్రయోగశాలలకు పంపాలని కర్నూలు జిల్లాకు సంబంధించి మట్టి నమూనాలను ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రానికి, అదేవిధంగా నంద్యాల జిల్లాకు సంబంధించి కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని జిల్లా వ్యవసాయాధికారులు ఆర్బీకే కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు జిల్లాలో 466 రైతు సేవా కేంద్రాలు ఉండగా. ఒక్కో కేంద్రం నుంచి 42 మట్టి నమూనాలు సేకరించాలని, అదేం శంగా నంద్యాల జిల్లాలో 411 రైతుసేవా కేంద్రాలు ఉండగా.. ఒక్కో వ్యవసాయ సలహా మండలి నుంచి 44 మట్టి నమూనాలు వెంటనే సేకరించి ఆయా ప్రయోగ కేంద్రాలకు పంపాలని నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు



కలెక్టర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న అధికారులు

నంద్యాల (కల్చరల్), జూలై 5: నంద్యాల కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు బదిలీ కావడంతో శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు రెవెన్యూ యంత్రాంగం, జిల్లా అధికారులు సంయుక్తంగా ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, రెవెన్యూ డివిజన్ల అధికారులు, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాకు రెండవ కలెక్టర్‌గా వచ్చి అత్యుత్తమ సేవలు అందించారని కొనియాడారు. కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఐదు నెలల కాలంలో అధికారులు, సిబ్బంది సహకారంతో అత్యంత బాధ్యాతయుతమైన కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేశామన్నారు. అనంతరం జిల్లా అధికారులు కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు.

'సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

బండిఆత్మకూరు, జూలై 5: సీజన్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. నారాయణపురం గ్రామంలో మలేరియా బారిన పడిన ఇంట్లో అల్ఫా సైపీరిత్రం ద్రావకాన్ని పిచికారీ చేయించారు. అనంతరం గ్రామస్థులతో వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుద్ధజలం, లేదా కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. వెంకటేశ్వరరెడ్డి, సుబ్రమణ్యం, కార్యదర్శి శేషకుమారి, శంకరాచారి, కిరణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

18 నుంచి రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్



బ్రోచర్లను విడుదల చేస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ

నంద్యాల (నూనెపల్లె), జూలై 5: ఏపీ చెస్ సంఘం ఆద్వర్యంలో నంద్యాలలో ఈ నెల 18, 19వ తేదీలలో అండర్ 19 రాష్ట్ర స్థాయి ముని నాగలక్ష్మి స్మారక చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. శుక్రవారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో టోర్న మెంట్‌కు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. రామకృష్ణ పీజీ కళాశాలలో ఈ పోటీలు జరుగుతాయని, రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని 26జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు చెప్పారు. గతంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించిన వారికి పోటీల్లో పాల్గొనేందుకు నేరుగా ప్రవేశం ఉంటుందని చెప్పారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు సెప్టెంబరు 20 వతేది నుంచి 28 వరకు హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

● అటవీ శాఖ జేడీ అనురాగ్ మీనా



తిమ్మాపురంలో మొక్క నాటుతున్న జేడీ అనురాగ్ మీనా

మహానంది, జూలై 5: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అటవీశాఖ జాయింట్ డైరెక్టర్ అనురాగ్ మీనా తెలిపారు. తిమ్మాపురంలో గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేడీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటికి ఒకటి చొప్పున మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి, ఎఫ్ఆర్వో దినేష్‌కుమార్‌రెడ్డి, ఎఫ్‌బీవో ప్రతాప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మొక్కలు నాటడం ఓ సామాజిక బాధ్యత అని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా పేర్కొన్నారు. శుక్రవారం వనం-మనం వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మండలంలోని బైర్లూటి బాలికల గురుకుల పాఠశాల నందు అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆత్మకూరు, బైర్లూటి రేంజ్ ఆఫీసర్ సుభాష్, పాఠశాల హెచ్‌ఎం రేఖామణి, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

'210 ఎకరాల్లో కంది సాగు'

జూపాడుబంగ్లా, జూలై 5: మండలంలోని తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రంలో ఖరీఫ్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 210 ఎకరాల్లో కందిసాగు వేస్తున్నట్లు ఏడీఏ అరుణలత తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు నల్లరేగడి పొలాల్లో పదును ఉండటంతో ఎల్ఆర్‌జీ-105 రకం నూతన వంగడాలతో కూడిన పౌండేషన్స్ విత్తనాలు సాగుచేస్తున్నామని చెప్పారు. ఎర్రనేలల్లో మళ్లీ వర్షం కురిస్తే సాగుచేస్తామని తెలిపారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

నంద్యాల రూరల్, జూలై 5: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ రోగాలకు దూరంగా ఉందామని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి పిలుపునిచ్చారు. శుక్రవారం గోస్పాడు మండలం జూలెపల్లె గ్రామంలో నిర్వహిం చిన డ్రై డే.. ఫ్రై డే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. డీపీవో మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే.. ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దోమలు ఉత్పత్తి కాకుండా కాలువల్లో పూడికలు, చెత్త కుప్పలను తొలగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోస్పాడు ఎంపీడీవో నాగఅనసూయ, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా: ఎమ్మెల్యే బుడ్డా




గోపవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

మహానంది, జూలై 5: రెండో సారి ఎమ్మెల్యేగా గెలిపించిన శ్రీశైలం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ప్రజల్లో తిరుగుతూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొంటా మని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గోపవరం, గాజులపల్లె గ్రామాల్లో శుక్రవారం రాత్రి థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. గత ప్రభుత్వంలోని నాయకుల మాదిరి కాకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ గ్రామాల్లో పర్యటించి అందుబాటులో ఉంటానని అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అరాచకాలు సృష్టిస్తూ ప్రజాధనాన్ని దోచుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గాజులపల్లె, గోపవరం గ్రామాల్లో కొంత మంది త ప్పుడు నాయకులు ఉన్నారని, వారి భరతం పడతామని హెచ్చరించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, మాజీ ఎంపీపీ నాగమణి, క్రాంతికుమార్, చిన్న రంగస్వామి, రామన్నగౌడ్, శివ, నందిరెడ్డి, శ్రీనివాసులు, మహేశ్వరరెడ్డి, శశికళారెడ్డి, కలర్స్ రవినాథరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభా మర్యాదలు పాటించాలి

● సర్వసభ్య సమావేశంలో అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

జూపాడుబంగ్లా, జూలై 5: సభా మర్యాదలు పాటించాలని ఎమ్మెల్యే గిత్తజయసూర్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పారుమంచాల చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని చిన్న నీటిపారుదలశాఖ ఏఈ రామ్మోహన్‌రెడ్డికి చెప్పినా పట్టించుకోవడంలేదని సర్పంచ్ ప్రకాశం సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఏఈ సర్పంచ్‌పై ఎదురుదాడికి దిగడంతో ఎమ్మెల్యే కల్పించుకున్నారు. సమస్య అడిగితే సమాధానం చెప్పాలే తప్ప సభామర్యాదలకు ఆటంకం కల్గకూడదని ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో నూర్జహాన్ 2024-25 సంబంధించి మండల, జనరల్‌ఫండ్‌కు సంబంధించిన నిదులతో చేపట్టే పనులకు సంబంధించి సభ్యులు ఆమోదిస్తే చేస్తామని చెప్పడంతో జూపాడుబంగ్లా ఎంపీటీసీ కృపాకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 2023-24లో జరిగిన పనులలో అవకతవకలు జరిగాయని, అవన్నీ లెక్కలు తేలేవరకు జరగబోయే పనులను చేపట్టకూడదని అన్నారు. దీంతో ఆ తీర్మానాలను పక్కన పెట్టి జరిగిన పనులకు సంబంధించిన లెక్కలు, రికార్డులు చూపాలని అప్పటి వరకు తీర్మాణాలు చేయవద్దని ఎమ్మెల్యే చెప్పారు. ఎక్కడ కూడా తాగునీటి సమస్యలేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నాడు-నేడు పనులకు సంబంధించి ఏమేరకు పనులు జరిగాయో చూపించాలని ఎంఈవో చిన్నమద్దిలేటిని ఆదేశించారు. త్వరితగతిన చాబోలు గ్రామస్థులకు జూపాడు బంగ్లాలో ఇళ్లస్థలాలు చూపించాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్‌కు సూచించారు. 80బన్నూరు గ్రామంలో శ్మశానానికి సంబంధించిన విషయంలో రెవెన్యూ, పోలీసుశాఖ సమన్వయంతో ఎవరికి ఆటంకం కల్గకుండా చూడాలన్నారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

'టైలర్ల సమస్యలు పరిష్కరించాలి'

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని జూపాడుబంగ్లా మండల టైలర్లు కోరారు. జూపాడుబంగ్లాలో జరిగిన సర్వసభ్యసమావేశానికి హాజరయ్యే సమయంలో ఎమ్మెల్యే జయసూర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. టైలర్ల సంఘం నాయకులు నజీర్, పెద్దమద్దిలేటి, మధు, ఖాసీం, చంద్ర, నాగన్న, రామకృష్ణ, విక్రమ్, తిరుపాలు, చంద్ర, రహిమాన్, చాంద్‌బాషా, సలాం తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

పాణ్యం, జూలై 5: పాణ్యం బస్టాండు పరిధిలో శుక్రవారం కుక్క దాడి చేసి ఐదుగురిని గాయపర్చింది. గ్రామంలో కుక్కల దాడులకు పలువులు గాయాల పాలయ్యారు. కాగా గాయపడిన వారు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందారు. వీరిలో గాజులపల్లెకు చెందిన అంకాలమ్మ తీవ్రంగా గాయపడిందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గ్రామంలో కుక్కల దాడుల నుంచి కాపాడాలని ప్రజలు కోరారు.

'అసైన్డ్ భూమిని విక్రయించడం నేరం'

పాణ్యం, జూలై 5: అసైన్డ్ భూములు కొన్నా, అమ్మినా నేరమేనని పాణ్యం తహసీల్దారు ఫణికుమార్ తెలిపారు. గత నెల 30వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అసైన్డ్ భూమిలో ప్రైవేటు వెంచర్ అన్న వార్తకు స్పందించిన రెవెన్యూ శాఖ నోటీసులు అందజేసింది. శుక్రవారం తహసీల్దార్ మాట్లాడుతూ తమ్మరాజుపల్లెలోని 208 బీ1, 208బీ2 సర్వే నెంబర్లలోని అసైన్డ్ భూమిని రైతు వడ్డె కృష్ణమూర్తి ప్రైవేటు ఇంటి స్థలాలకు విక్రయించారు. దీనిపై తహసీల్దారు విచారణ జరిపి రైతులకు, కొన్న వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అసైన్డ్ భూమిని పేద రైతులకు అసైన్డ్ కమిటీ ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ భూమిని వారసత్వంగా పండించుకొని జీవనం సాగించాలే తప్ప వ్యాపారానికి ఉపయోగించకూడదన్నారు. అసైన్డ్ భూమి కొన్నా రిజిస్ట్రేషన్ చెల్లదని తెలిపారు. పంచాయతీ అనుమతి లేకుండా లేఅవుట్లు వేయడం నేరమని అన్నారు. రెండు రోజుల్లో భూమిలో ఏర్పాటు చేసిన సర్వే రాళ్లను తొలగించాలని రైతులను ఆదేశించామన్నారు. దీనిపై 15 రోజుల్లో రైతు, కొనుగోలుదారుడు వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు.

'డిగ్రీ కోర్సులను సద్వినియోగం చేసుకోండి'

ఆత్మకూరు, జూలై 5: ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు అందుబాటులో ఉంచిన డిగ్రీ కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిష్ణు నాగ్ విజయ్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జవహర్ విజ్ఞాన కేంద్రం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ వంటి అదనపు సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. కాగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ(పొలిటికల్ సైన్స్, హిస్టరీ), బీఏ(పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్), బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్, ఎకనామిక్స్), బీకామ్(కంప్యూటర్ అప్లికేషన్, కామర్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ (ఫిజిక్స్, మాథెమాటిక్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్, మాథెమాటిక్స్), బీఎస్సీ (జువాలజీ, కెమిస్ట్రీ), బీఎస్సీ(జువాలజీ, బొటనీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోర్సుల రిజిస్ట్రేషన్‌కు ఫీజు ఉచితమని తెలిపారు. ఆన్‌లైన్ ప్రవేశాలు కూడా జూలై 2 నుంచి ప్రారంభించినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 7981214557, 9441082599, 9395122131 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

అదనపు స్థలం కోసం సర్వే

పాములపాడు, జూలై 5: మండలంలో చేపడుతున్న నేషనల్ హైవే నిర్మాణపు పనుల్లో అదనంగా స్థలం కోసం అధికారులు సర్వే నిర్వహించారు. శుక్రవారం పాములపాడులో భారత్ పెట్రోల్ బంకు నుంచి దాదాపు 60 మందికి రైతులకు సంబంధించిన మూడు ఎకరాల పొలంలో నేషనల్ హైవే జేఈ వైద్యనాథ్ సర్వేయర్ భాస్కర్, వీఆర్వో ముర్తుజా సిబ్బందితో కొలతలు వేశారు. ప్రస్తుతం 60 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే అదనంగా స్థలం అవసరం కావడంతో కొలతలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి: డీఈవో



శింగవరం హైస్కూల్‌లో నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

బండిఆత్మకూరు, జూలై 5: విద్యార్థుల్లో ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంచాలని డీఈవో సుధాకర్‌రెడ్డి సూచించారు. మండలంలోని శింగవరం గ్రామంలోని హైస్కూల్‌లో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న నాడు, నేడు రెండో విడత పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం బండిఆత్మకూరు తహసీల్దార్ సుమతితో గిరిజన వసతి గృహానికి స్థల సేకరణ గురించి చర్చించారు. ఎర్రగుంట్ల హైస్కూల్‌లో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని డీఈవో పరిశీలిం చారు. రఘురామిరెడ్డి, యశోద, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణే లక్ష్యం'

నంద్యాల టౌన్, జూలై 5: వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణే ఏకైక లక్ష్యంగా మహర్షి వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి పని చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలుస్వామి అన్నారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో ఎంవీఆర్‌పీఎస్ మొదటి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకులను ఏకం చేస్తామన్నారు. నాయకులు నాగేశ్వరరావు, జయరామ్, మదుగోపాల్, రాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'అనుమతుల్లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు'



ఆత్మకూరులోని విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 5: ప్రభుత్వ అనుమతుల్లేని విత్తనాలు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని వ్యవసాయశాఖ రాష్ట్ర తనిఖీ బృందం డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం హెచ్చరించారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని విశ్వంభర, లలితా విత్తన దుకాణాలను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లోని స్టాక్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అలాగే ఎరువుల అమ్మకాలను పురుగుమందుల బిల్లుల్లో నమోదు చేయడంతో రూ.2,64,390 అమ్మకాలను నిలుపుదల చేశారు. ఆయన వెంట విజిలెన్స్ సీఐ సునీల్, ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, ఏవోలు విష్ణువర్థన్‌రెడ్డి, మహేష్ తదితరకులు ఉన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరులో ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో అనుమతులు లేకుండా పురుగు మందులు అమ్ముతున్నారని పవన్ ట్రేడర్స్‌పై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో విచారణకు నందికొట్కూరు వ్యవసాయశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో ఏడీఏ విజయశేఖర్, ఏవో శేక్షా వలి పవన్ ట్రేడర్స్ ఎరువుల దుఖాణానికి సంబంధించిన గోదాము, దుకాణం తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గోడౌన్‌ను నిర్వహిస్తుండడంతో సీజ్ చేశారు. రూ.2,48,450 విలువ గల మైక్రో న్యూట్రీన్ మందులను సీజ్ చేసినట్లు ఏడీఏ తెలిపారు.

వెలుగోడు: ఎరువులు, విత్తన దుకాణ యజమానులు నియమ నిబంధనలు ఉల్లం ఘిస్తే చర్యలు తప్పవని వ్యవ సాయ అధికారులు హెచ్చరిం చారు. వెలుగోడులో వ్యవసాయ స్క్వాడ్ టీం డీడీఏ సుబ్రహ్మణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్ ఏవో పవన్‌కుమార్ పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీనివాస ఆగోర ఏజన్సీస్‌లో అనుమతి లేని రూ.5 లక్షల విలువ గల బయో ఉత్పత్తుల అమ్మకాలను నిలుపుదల చేశారు. టెక్నికల్ ఏవో అయ్యూబ్, ఏఈవో సుధారాణి సిబ్బంది రామకృష్ణ, అంజిత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి పట్టు చీర



అమ్మవారికి పుట్టింటి పట్టు చీర, సారె తీసుకొస్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 5: నంద్యాల పట్టణంలోని జగజ్జననీ మాతకు ఆషాడమాసం పురష్కరించుకొని చీర సారె సమర్పించుకోవచ్చునని దుర్గాఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తెలిపారు. శనివారం ఆషాడమాసం ప్రారంభం సందర్భంగా అమ్మవారికి సమర్పించే ఆషాడమాసం పట్టీ గురించి భక్తులకు వివరించారు.. ఇందులో భాగంగా జగజ్జననీ మాతకు ప్రతి ఏడాది ఆషాడమాసంలో మహిళలు భక్తి శ్రద్ధలతో సారె సమర్పిస్తారని ఈ ఏడాది కూడా అమ్మవారికి సమర్పించవచ్చని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దుర్గాభోగేశ్వర ఆలయంలో పూజలు

గడివేముల, జూలై 5: మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఆరుద్ర నక్షత్రం కావడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలోని పంచకోనేర్లలో స్నానం ఆచరించి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ భక్తులతో ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో రామానుజన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బరక సంజీవ రాయుడికి..

మిడుతూరు, జూలై 5: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామం వెలసిన బరక సంజీవ రాయుడికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమావాస్య సందర్భంగా పీరుసాహేబ్ పేట గ్రామస్థులు ఆకుపూజ, హోమం, పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు స్వీకరించారు.

'కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి'

ఆత్మకూరు రూరల్, జూలై 5: నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించి, వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కౌలు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అష్రఫ్ అలి, పండ్ల తోటల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్‌లో కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపేందుకు సంతకాల సేకరణ చేపట్టారు. సీఐటీయూ నాయకులు రణధీర్, రామ్‌నాయక్, మహ్మద్, కౌలు రైతులు పాల్గొన్నారు.

బయలు వీరభద్ర స్వామికి ఆర్జిత పరోక్ష సేవ



వీరభద్ర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూలై 5: శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం అమావాస్య ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం శ్రీశైల క్షేత్రపాలకుడైన బయలు వీరభద్రస్వామికి పరోక్ష సేవగా విశేష అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహాగణపతికి ప్రత్యేక పూజాధికాలు నిర్వహించి వీరభద్ర స్వామికి పంచామృతాలతో, బిల్వోదకం, కుంకుమోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారి పరోక్ష సేవలో మొత్తం 18 మంది భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ. 1,116 సేవా రుసుమును చెల్లించి జరిపించుకున్నారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు పాల్గొనేందుకు దేవస్థానం ఈ పరోక్షసేవల ద్వారా అవకాశం కల్పించింది. ప్రతి నెల అమావాస్య రోజులలో బయలు వీరభద్రస్వామికి జరిపే పరోక్ష సేవలో భక్తులు పరోక్షసేవ ద్వారా పాల్గొనవచ్చని దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జీ దేవస్థానం వెబ్‌సైట్‌లో రూ. 1,116 లు సేవా రుసుమును చెల్లించి ఏ సేవలో అయినా పాల్గొనవచ్చు. స్వామివారి రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన మినహా మిగతా అన్నీ సేవలను భక్తులు శ్రీశైలటీవీ, యూట్యూబ్ చానల్ ద్వారా వీక్షించవచ్చని ఈవో తెలిపారు.

● శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను వైభవంగా నిర్వహించారు. అలాగే గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం దేవస్థానం విశేష పూజలు నిర్వహించింది.

మసీదు అభివృద్ధికి సహకారం: మంత్రి



ముస్లిం మత పెద్దలతో మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (కల్చరల్/నూనెపల్లె), జూలై 5: నంద్యాలలోని సాయి బాబా నగర్‌లోని కూబ్రా మసీదు అభివృద్ధికి సహకరిస్తానని రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం కుబ్రా మసీద్, షాదీఖాను సందర్శించి కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు అంజాద్‌బాషా సిద్దిఖీ, కమిటీ సభ్యులు కూబ్రా మసీదు, షాదిఖానా అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరారు. షాదిఖానా, ఈద్గా అభివృద్ధి కోసం రూ.50 లక్షలు నిధులు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మత గురువులు మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు స్వీట్లు తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.

'సగరుల సమస్యలు పరిష్కరించాలి'

నంద్యాల (నూనెపల్లె): జిల్లాలోని సగరుల సమస్యలను పరిష్కరించా లని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పరి సురేష్ కుమార్ కోరారు. శుక్రవారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను సగర జిల్లా సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా , పుష్పగుచ్ఛం అందించి ఆయనను సన్మానించారు. వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాలాజి, చిన్నయ్య, శ్రీనివాసులు అమర్‌నాథ్ తదిరతులు పాల్గొన్నారు.

ఆర్జీఎంలో రోబో ఆవిష్కరణ



రోబోను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, డీన్

పాణ్యం, జూలై 5: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్), బీఎస్ విభాగాల ఆధ్వర్యంలో నీలా పేరుతో రోబోను తయారు చేసి ఆవిష్కరించారు. రోబోట్ లైబ్రరీ నిర్వహణ, కార్యకలాపాలకు సహాయం చేయడం వంటి పనులు నిర్వహి స్తుందని యూనిఫస్ట్ రోబోటిక్స్ వ్యవస్థాపకుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ రోబోపై విద్యార్థులు, ఫ్యాకల్టీ సభ్యులు ఏఎల్, ఎంఎల్ పద్ధతులను ఉపయోగించి పరిశోధనలు చేయవచ్చన్నారు. రోబో నిర్వాహ ణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి యుగంలో రోబోల వినియోగం ఎంతో కీలక పాత్ర పోషిస్తుందని రోబో మిరాకిల్ కో ఫౌండర్ సూరజ్ సుకుమారన్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డీన్ డాక్టర్ రామిరెడ్డి, ఏఐఎంఎల్ హెచ్‌వోడీ డాక్టర్ కిషోర్‌కుమార్, డీఎస్ హెచ్‌వోడీ భాస్కరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

నందికొట్కూరు రూరల్, జూలై 5: నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామం సమీపంలో ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాలివీ.. నందికొట్కూరు మండలం కొణిదేల గ్రామ సమీపంలో పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన కాటమ్ నవీన్ (25) అనే ఆటో డ్రైవర్ రోడ్డుపై ఉన్న గుంతను తప్పించే ఆటో బోల్తా పడింది. దీంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్ మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

మడకశిరలో రోడ్డు ప్రమాదం

నంద్యాల యువకుడి దుర్మరణం

● మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



అశోక్(ఫైల్)

మడకశిర టౌన్, జూలై 5: శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండల పరిధిలోని యు.రంగాపురం గ్రామ సమీపం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అశోక్(21) అనే యువకుడు అక్కడిక క్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు యువకులు అశోక్, నవీన్, గణేష్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు నంద్యాలకు చెందిన అశోక్, నవీన్, గణేష్, గద్వాలకు చెందిన అనిల్ నలుగురూ స్నేహ కోళ్లఫారంలో సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్నారు. ఈనలుగురూ రెండు ద్విచక్ర వాహనాల్లో మడకశిరకు వస్తుండగా యు.రంగాపురం గ్రామ సమీపంలోకి రాగానే వెనకనుంచి వచ్చిన లారీ బైక్‌లను ఢీకొట్టి వెళ్లింది. రోడ్డుపై పడిపోయిన వారు లేస్తున్న సమయంలో వెనక నుంచి వచ్చిన మరోలారీ వారిపై దూసుకుపోయింది. దీంతో అశోక్ అక్కడికక్కడే మృతి చెందగా నవీన్, అనీల్, గణేష్ తీవ్రగా యాలతో బయటపడ్డారు. వారిని 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం ఏఎస్‌ఐ బ్రహ్మానందరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో సంఘటన వివరాలు అడిగి నమోదు చేసుకొ న్నారు. ఢీకొట్టిన లారీలను గుర్తించేందుకు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆస్పత్రి వద్దకు వెళ్లి మార్చురీలో అశోక్ మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సంఘటన వివరాలను తెలుసుకొన్నారు. ప్రమాదానికి కారణమైన లారీలను గుర్తించాలని పోలీసులకు సూచించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అనుమతి లేని విత్తనాలు సీజ్



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నంద్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని విత్తన దుకాణాల్లో అనుమతులు లేని విత్తనాలను సీజ్ చేసినట్లు ఏడీఏ రామ్మోహనరెడ్డి చెప్పారు. రాష్ట్ర అగ్రికల్చర్, విజిలెన్స్ శాఖ వారు విత్తన దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దుకాణాల్లో రికార్డులు, బిల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో విత్తన దుకాణాల్లో రూ. 7.25 లక్షలు విలువ చేసే అనుమతి లేని విత్తనాలను గుర్తించి వాటి అమ్మకాలను నిలిపివేశామన్నారు. మైలవరం ఏడీఏ శ్రీనివా సులు, విజిలెన్స్ అధికారి సిద్దయ్య, ఆళ్లగడ్డ ఏవో కిశోర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విత్తన విక్రయాల నిలిపివేత

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని లక్ష్మీ వెంకట సాయిసీడ్స్, ఎస్వీ ఏజెన్సీ విత్తన, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరావు, ఏడీఏలు సిద్దయ్య, రామ్మోహనొరెడ్డి తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. సాయిసీడ్స్ దుకాణంలో రూ.78 వేలు, ఎస్వీ ఏజెన్సీలో రూ.3 లక్షల విలువైన విత్తనాలకు సంబంధించిన రికార్డులు సరిగా లేనందున విత్తనాల అమ్మకాలు నిలిపివేశారు. ఏవో రంగనేతాజీ, టెక్నికల్ ఏవో నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

రుద్రవరం: రుద్రవరం గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఎరువుల దుకాణాలపై శుక్రవారం దాడి నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు, వ్యవసాయశాఖ ప్రత్యేక బృందాలు అసిస్టెంటు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడులు చేశారు. జయశంకర్ ఏజెన్సీలో రూ.1,26,689, రాఘవ ట్రేడర్స్‌లో రూ.7,80,180 విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలిపివేశామన్నారు. వీటికి ఎలాంటి పత్రాలు చూపకపో వడంతో అమ్మకాలు నిలిపివేశామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు సిద్దయ్య, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏవో శ్రీకృష్ణ, టెక్నికల్ ఏవో నాగేంద్రప్రసాద్, ఏఈవో రాజు ఉన్నారు.

'మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి'

నంద్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చైర్మన్ రామలింగారెడ్డి అన్నారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజల అత్యవసరాల కోసం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం, పాతబస్టాండు వద్ద ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. వీటి నిర్మాణాల కోసం కాంట్రాక్టర్లు ముందుకు రావాలని ఆయన కోరారు. సంతమార్కెట్‌లో కూరగాయల అంగళ్ల నిర్మాణం కోసం ఔత్సాహికులు ముందుకు రావాలన్నారు. సమావేశంలో కమిషనర్ రమేష్‌బాబు, ఇంజనీరు సురేంద్రనాథరెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వన మహోత్సవం

కోవెలకుంట్ల, జూలై 5: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల డిగ్రీ కళాశాలలో ఇక్ క్లబ్ ఆధ్వర్యంలో వన మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణుగోపాల్ ఇక్‌క్లబ్ సమన్వయకర్త రామసుబ్బారెడ్డిలు మొక్కలు నాటి వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు క్రిష్ణశశాంక, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, వెంకటేశ్వరెడ్డి, భాస్కరొరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శైలజ, పుల్లయ్య, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణయాదవ్

ప్యాపిలి, జూలై 5: విద్యార్థులు చదువులో రాణించాలని టీడీపీ సీనియర్ నాయకుడు వై లక్ష్మీనారాయణయాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇస్తుందన్నారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్టు ద్వారా దుస్తులు, బూట్లు, బెల్టు, బ్యాగులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దామోద రనాయుడు, సందీప్, సురేంద్ర, బాలిరెడ్డి, రామసుబ్బయ్య, లక్ష్మయ్య, నరేష్, సుంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నాణ్యతా ప్రమాణాలు సరిగా లేకపోతే చర్యలు'



నాణ్యతా ప్రమాణాలను సేకరిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఉయ్యాలవాడ, జూలై 5: ప్రభుత్వ నిధులతో చేసిన పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉంటే చర్యలు తప్పవని క్వాలిటీ కంట్రోల్ డీఈఈ మోహన్ హెచ్చరించారు. శుక్రవారం ఉయ్యాలవాడ గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ, మరో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుల నాణ్యతా ప్రమాణాలను వారు సేకరించారు. అధికారి మాట్లాడుతూ తాము సేకరించిన నాణ్యత ప్రమాణాలను ల్యాబ్‌కు పంపుతామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక, సిమెంట్, ఐరన్, ఇటుక వాడారా? లేదా? అన్న అంశాలను పరిశీలించి వాటిలో నాణ్యతా ప్రమాణాలు తక్కువగా ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈ లక్ష్మయ్య, మండల పీఆర్ ఏఈ క్రిష్ణారెడ్డి ఉన్నారు.

విద్యుత్ లైన్లు ఏర్పాటు



డి.కొట్టాలలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

రుద్రవరం, జూలై 5: మండలంలోని దక్షిణకొట్టాల గ్రామంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చొరవతో ఆరు విద్యుత్ స్తంభాలు కొత్తగా ఏర్పాటు చేసి కొత్త లైనును ఏర్పాటు చేసినట్లు శుక్రవారం టీడీపీ నాయకుడు కృష్ణారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేను సంప్రదించిన వెంటనే స్పందించి కొత్తస్తంభాలు ఏర్పాటు చేయించి విద్యుత్ లైను ఏర్పాటు చేయడంతో ఆ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. కొన్నేళ్లుగా ఉన్న సమస్య వెంటనే పరిష్కారం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

బేతంచెర్ల, జూలై 5: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని అగ్రికల్చర్ అసిస్టెంట్లు యశోధ, భారతి అన్నారు. శుక్రవారం మండలంలోని రంగాపురంలో కాంతరెడ్డి అనే రైతు పొలంలో భూసార పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి బీసీ జన్మదిన వేడుకలు

బనగానపల్లె, జూలై 5: పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మైనార్టీనాయకుడు ఎస్‌ఎండీ రఫీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు సయ్యద్ హుసేన్ నియాజీ, అమీర్‌జాన్, అబ్దుల్, సయ్యద్ అబ్బాస్, షపి, మహమూద్, జాఫర్‌హుసేన్, అజిత్‌అహ్మద్ పాల్గొన్నారు.

నందవరంలో.. మండలంలోని నందవరంలో మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటన్న, టీడీపీ నాయకులు వెంగన్న, లక్ష్మీరెడ్డి, యుగంధర్, కుమ్మరి మధుమోహన్, నిరంజన్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

● **వృద్ధులకు చీరెలు పంపిణీ:** బనగానపల్లె పట్టణంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వృద్ధులకు టీడీపీ నాయకులు టంగుటూరు శ్రీనయ్య, వంగల పరమేశ్వరరెడ్డిలు శుక్రవారం చీరెలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకుటు కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, మల్లారెడ్డి, బత్తుల భాస్కర్‌రెడ్డి, కోడినగేశ్, టీచర్ నాగరాజు పాల్గొన్నారు.

● మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని బీసీ ఇందిరమ్మ అన్నారు. శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పట్టణంలోని కొండపే టలోని పెద్దపీర్ల చావిడి వద్ద మొక్కలు నాటారు. అనంతరం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. పాఠశాల స్పెషల్ అధికారి సునీత కోరిక మేరకు పాఠశాలకు టేబుళ్లు, కుర్చీలని అందించారు. కార్యక్రమంలో సీఐ గంటా సుబ్బారావు, టీడీపీ నాయకులు ముజీబ్, పవన్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ బురానుద్దీన్, సయ్యద్ హుసేన్ నియాజీ, షబ్బీర్, ఎస్‌ఎండీ రఫీ, హుస్సేని, అబ్దుల్‌రహిమాన్, చాంద్‌బాషా, అల్లాబకాష్ పాల్గొన్నారు.

● బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలోని రోగులకు బ్రెడ్లు, పాలు టీడీపీ నాయకులు సయ్యద్ హైదర్, అన్వర్‌సాహెబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సీఐ గంటా సుబ్బారావు, పత్తి మహబూబ్ బాషా, మెకానిక్ బాబు, సోలార్ రఫీ, రేహాన్, తన్వీర్, సాధిక్, రఫీ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల మధ్య శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ ఇందిరమ్మ హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ కోవెలకుంట్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు తన సమక్షంలో జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అలాగే రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, కోవెలకుంట్ల మాజీ సింగిల్‌విండో చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ కోఆప్షన్ మెంబరు ఎస్‌ఏ గఫూర్, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దిలేటి, యువ నాయకులు మల్లిఖార్జునరెడ్డి, గడ్డం అమర్‌నాధరెడ్డి, పెనుగొండ రాజశేఖర్‌లు బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. వల్లంపాడు సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి చిన్నకొప్పెర్ల మాజీ సర్పంచ్ బుచ్చన్న, లింగాల నాయుడు, గోవిందిన్నెబాలరాజు, లాయర్ శ్రీకాంత్, గుండయ్య, బీజేపీ నాయకురాలు షేక్ చాందిని పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

కొలిమిగుండ్ల: నిస్వార్థ రాజకీయ నాయకుడు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అని మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కొలిమిగుండ్ల మండలంలో మంత్రి బీసీ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పేట్నికోట గ్రామంలో తెలుగు యువత అధ్యక్షుడు గొంగటి హుస్సేన్‌రెడ్డి ఆధ్వర్యంలో శివారెడ్డి, నారాయణరెడ్డి, అబ్దుల్‌ఖాదర్ కేక్ కట్ చేశారు. కొలిమిగుండ్ల కస్తూర్బా పాఠశాలలో టీడీపీ నాయకులు అందె రాము, కొప్పుల మధు, శివ, తలారి చంద్రశేఖర్, ఎమ్మార్పీస్ నాయకులు, తెలుగు యువత నియోజకవర్గ అధికార ప్రతినిధి మందా విజయ్, జి.దస్తగిరి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి, మొక్కలు నాటారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గూలి నాగేశ్వరెడ్డి, గూడూరు నాగేశ్వరరెడ్డి, మహే శ్వరరెడ్డి, చంద్రమోహన్, రాంభూపాల్‌రెడ్డి, బ్రీడ్స్‌యూత్ రవి రోగులకు పాలు, పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉలువల ప్రసాద్, వెంకటరాముడు, నంద్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అవుకు పట్టణంలో టీడీపీ నాయకులు వంగల పరమేశ్వరరెడ్డి, బత్తిన మద్దిలేటిగౌడు, వెంకటరమణనాయక్, దంతెల రమణ, తిక్కన్న ఆధ్వర్యంలో వీధుల్లో బీసీ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ బ్యానర్లు వెలిశాయి. అలాగే కస్తూర్బా పాఠశాలలోని 243 మంది విద్యార్థినులకు టీడీపీ నాయకులు తిరుమలనాయక్, నీలి భాస్కర్, శ్రీనివాసులు, గుర్రాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వాటర్ బాటిళ్లు, షటిల్‌బ్యాట్లు, సిప్పింగ్ తాళ్లు క్రీడా సామగ్రిని అందజేశారు. టీడీపీ నాయకులు డాన్‌సూరి, మల్లి, గుర్రప్ప, శ్రీకాంత్, మహేంద్ర, వెంకటేష్, వెంకటసుబ్బయ్య, సుబ్బరాయుడు, ఆఫ్రిద్, గురువయ్య పాల్గొన్నారు.

సంజామల: మండలంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల వెంకటప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్కి హుసేన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తోట శ్రీనివా సరెడ్డి, తోకల మద్దిలేటి, ఓబుళరెడ్డి, మాధవ, సుబ్బారావు, రవి, సీతారామిరెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.







రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, కోవెలకుంట్లలో.., అవుకులో విద్యార్థినులకు క్రీడా వస్తువులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



బనగానపల్లెలో కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



వృద్ధులకు చీరెలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



కోవెలకుంట్లలో మంత్రి బీసీ జన్మదిన వేడుకల్లో బీసీ ఇందిరమ్మ, టీడీపీ నాయకులు



పెట్నికోటలో కేక్ కట్ చేస్తున్న హుస్సేన్‌రెడ్డి



సంజామలలో..

ఆలయాభివృద్ధికి రూ.4 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత కొట్టి రమేష్

బనగానపల్లె, జూలై 5: నందవరం చౌడేశ్వరీమాత ఆలయాభివృద్ధికి బెంగళూరుకు చెందిన దాత కొట్టి రమేశ్ కుటుంబ సభ్యులు రూ.4లక్షల విరాళాన్ని శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ. కుమార్‌రెడ్డికి అందించారు. ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మాణానికి ఈ విరాళం అందించినట్లు పీవీ కుమార్‌రెడ్డి తెలిపారు. దాత కొట్టి రమేష్‌ను అభినందించారు. ఎన్.లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, చిరంజీవిరెడ్డి, పుల్లారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 5: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కోట్ల నివాసంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులతో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక విధానంలో దోపిడీ చేశారని, ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు పేదలకు ఉచిత ఇసుకను అందించే విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పింఛన్లను పెంచి అవ్వా తాతలకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు, వివిధ వర్గాల కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్నారు. కరువు ప్రాంతమైన డోన్ నియోజకవర్గంలో లిఫ్టు ఇరిగేషన్ సౌకర్యాన్ని రైతులకు అందుబాటులో తీసుకు వస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, నల్లమేకల పల్లె సత్యం, చౌదరి, రాజశేఖర్, మామిళ్లపల్లి మోహన్‌యాదవ్, బీజేపీ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించిన వారిని అరెస్ట్ చేయాలి

కొలిమిగుండ్ల, జూలై 5: గిరిజన ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని ఏపీ ఎరుకల సంఘం జిల్లా నాయకులు గంగన్న, శ్రీనివాసులు, మురళి, రమణ డిమాండ్ చేశారు. కొలిమిగుండ్ల మండలం కోరుమానుపల్లె గ్రామంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లును గత నెల 29న ఇష్టానుసారంగా దుర్భాషలాడి, దాడి చేసిన గ్రామ నాయకులు విజయ భాస్కరరెడ్డి, దూదేకుల పెద్దనడిపిలను అరెస్ట్ చేయాలని కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్ వద్ద ఎరికల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పాఠశాలలో బియ్యం బస్తాలు పెటుకుంటే విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని అభ్యంతరం చెప్పిన కారణంగా ఉపాధ్యాయుడిని దుర్భాషలాడి, దాడికి యత్నించడం దారుణమన్నారు. అనంతరం ఉపాధ్యా యుడిని తక్షణమే వేరొక పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపాలని వారు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు నాగన్న, బాలప్ప, వీరభద్రుడు, బాబు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

'రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి'

శిరివెళ్ల, జూలై 5: ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించిన దుకాణదారులు రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. శిరివెళ్లలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ధరలు సూచించే బోర్డులు తదితర వాటిని ఆయన పరిశీలించారు. వ్యవసాయశాఖ అధికారులు సిద్ధయ్య, రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు

సంజామల, జూలై 5: ఆయిల్‌ఫాం సాగుతో రైతులు అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖాధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆల్లకొండ, రెడ్డిపల్లె రైతులను ఆల్వకొండ రైతుసేవ కేంద్రంలో ఆయిల్‌ఫాం సాగుపై అవగాహన కల్పించారు. పంటసాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పతాంజలి ఫుడ్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, మేనేజరు మహాదేవయ్య, రైతులు, ఉద్యానవనశాఖ మండల అధికారి ధరణి పాల్గొన్నారు.

అహోబిలంలో ఏపీ విద్యుత్ బోర్డు చైర్మన్

నంద్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ బోర్డు చైర్మన్ సీవీ నాగార్జునరెడ్డి శుక్రవారం అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయన రాకను పురస్కరించుకొని ఆలయ వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈయన ఎగువ, దిగువ అహోబిలాల్లో పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు పలికి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఈఈ రమణారెడ్డి, ఏడీఈ రవికాంత్‌చౌదరి ఉన్నారు.

అహోబిలంలో జీర్ణోద్ధరణ : అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో జీర్ణోద్ధరణ, అష్టబంధన, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు వైభంగా జరుగుతున్నాయి. శుక్రవారం వేదపండితులు ఉత్సవమూర్తులైన ప్రహ్లాద వరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను మాడవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, జూలై 5: చాగలమర్రి గ్రామంలోని బుగ్గవీధిలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో న్యామతుల్ల తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని అన్నారు. ప్రతి రోజు పాఠశాలకు నిర్ణీత సమయంలో హాజరై ముఖ హాజరు వేయాలని సూచించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పాఠశాలలో కొళాయి నీటిని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

చాగలమర్రి, జూలై 5: చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించడంతో విద్యార్థులకు శుక్రవారం కొళాయిల ద్వారా నీటిని హెచ్‌ఎం కోటయ్య ప్రారంభించారు. మూతపడ్డ మినరల్ వాటర్ ప్లాంట్ అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రారంభమైంది. అధికారులు స్పందించి ప్లాంట్ మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రవింద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పీడీ దాదాపీర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్యాపిలి, జూలై 5: మండలంలోని చంద్రపల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త రామక్రిష్ణ కుటుంబానికి ఆ గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు వై లక్ష్మీనారాయణయాదవ్ రూ.35వేలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం మృతుడి ఇంటికి వెళ్లి భార్య లక్ష్మీ దేవికి ఆర్థిక సాయం అందజేశారు. పాల రామక్రిష్ణ, రామసుబ్బయ్య, బాలిరెడ్డి, సుబ్బయ్య, రామ్మోహన్, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

నంద్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ సీడీపీవో తేజస్విని సూచించారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి, దొర్నిపాడు మండలాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలతో పి.చింతకుంట బాలసదనంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

చెంచు విద్యార్థులకు హాస్టల్ మంజూరు

రుద్రవరం, జూలై 5: ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మండలంలోని హరిహరనగరం చెంచుగూడేనికి హాస్టలు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య తెలిపారు. శుక్రవారం రెవెన్యూ అధికారుల సహకారంతో స్థలాన్ని పరిశీలించామన్నారు. పీవీ టీజీ కింద ఉన్న చెంచు విద్యార్థులకు హాస్టలు మంజూరైందని చెప్పారు.

భార్యాభర్తలను బెదిరించి నగదు, బంగారు వస్తువుల అపహరణ

బేతంచెర్ల, జూలై 5: నంద్యాల రహదారిలోని తమ్మరాజుపల్లె మెట్ట ఎక్కిన తర్వాత సిమెంటునగర్ గ్రామ సమీపంలో కారులో వస్తున్న భార్యాభర్తలు కాలకృత్యాలు తీసుకుంటుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు వారిపై దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనంతపురం పట్టణానికి చెందిన ముస్తాక్ తన భార్యతో కారులో విశాఖపట్నం వెళ్లి సొంత ఊరికి బయలుదేరారు. మార్గమధ్యలో గురువారం తమ్మరాజుపల్లె ఘాట్ ఎక్కిన తర్వాత కాలకృత్యాల కోసం కారు ఆపారు. అక్కడ మాటు వేసిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వారి దగ్గరకు వచ్చి బెదిరించి అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లి కారులో ఉన్న నగదు రూ.6,500, అమె మెడలో ఉన్న బంగారు గొలుసు, ముక్కురాళ్లు, చెవికమ్మలు తీసుకుని ఎవరికైనా ఈ విషయం చెబితే చంపేస్తామని బెదిరించి వదిలేసి వెళ్లారు. అనంతరం సిమెంటునగర్‌కు చేరుకున్న బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

సొసైటీ సీఈవోగా సిద్ధి హర్షవర్ధన్

దొర్నిపాడు, జూలై 5: మండలంలోని దొర్నిపాడు సహకార సంఘం సొసైటీ సీఈవోగా సిద్ధి హర్షవర్ధన్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టినట్లు దొర్నిపాడు సొసైటీ అఫీసియల్ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరానికి ముందు సొసైటీ సీఈవోగా విధులు నిర్వహిస్తూ వచ్చారని, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొన్ని కారణాల వల్ల విధుల నుంచి తొలగించారని చెప్పారు. సిద్ధి హర్షవర్ధన్ కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఉత్తర్వుల ప్రకారం డీసీవో ప్రొసిజర్స్ ప్రకారం సిద్ధిహర్షవర్ధన్‌ను విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు ఇవ్వడంతో సీఈవోగా విధులు నిర్వహిస్తున్న పగడాల ప్రసాద్ స్థానంలో సిద్ధి హర్షవర్ధన్ బాధ్యతలు చేపట్టారని తెలిపారు. సీఈవోగా విధులు నిర్వహిస్తున్న పగడాల ప్రసాద్‌ను క్లర్క్‌గా నియమించినట్లు అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ దొర్నిపాడు సహకార సంఘం సొసైటీ నుంచి వివిధ రకాల లోన్‌ల కింద రూ.16 కోట్లు రుణాలు అందించినట్లు తెలిపారు. సిద్ధిహర్షవర్ధన్ మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పగడాల ప్రసాద్, చిన్నయ్య, రైతులు ఉన్నారు.

హైకోర్టు ఏజీపీగా చింతలచెరువు రవితేజ

చాగలమర్రి, జూలై 5: చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన నేరేళ్ల రవితేజ రాష్ట్ర హైకోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. హైదరాబాద్ నారాయణ కళాశాలలో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ, ఎల్‌ఎల్‌ఎం, పీజీ కోర్సులు పూర్తి చేశారు. 2015లో ఏపీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైదరాబాదు ట్రయల్ కోర్టులలో, హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ రాష్ట్ర విభజన తరువాత ఏపీ హైకోర్టులో పని చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రవితేజ నైపుణ్యం గుర్తించి ఏజీపీగా నియమించింది. హైకోర్టు ఏజీపీగా నియమితులైన రవితేజను తల్లిదండ్రులు చంద్రశేఖర్, సుప్రియ, పలువురు అభినందించారు.

'సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలి'

నంద్యాల, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరులో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త అట్ల శ్రీదేవి హత్య కేసులో ఏవీ సుబ్బారెడ్డి పాత్ర ఉందని, ఆయనపై చర్యలు తీసుకోవాలని శ్రీదేవి కుమారుడు అట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కుమార్తె రమశ్రీ కోరారు. టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసరావును శుక్రవారం వారు అమరావ తిలో కలిసి వినతి పత్రం అందించారు. అలాగే తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆలా రామకృష్ణ

డోన్(రూరల్), జూలై 5: డోన్ పట్టణంలోని రామచంద్ర మాలిక్‌బాబా ఆలయ కమిటీ చైర్మన్‌గా ఆలా రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జయరాం, కోశాధికారిగా నాగభూషణం, కమిటి సభ్యులుగా మురళీకృష్ణ, ప్రసాద్, రామచంద్ర ప్రసాద్, జగన్, భాస్కర్, శైలజ, చంద్ర శేఖర్ రెడ్డి, న్యాయవాది నరసింహులును ఎన్నుకున్నారు.